క్లుప్తంగా

వంటశాల ప్రారంభం



వంటశాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మహేశ్వరరావు

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటశాలను స్థానిక సర్పంచ్ జి.మహేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాలు వండేందుకు వంటశాల లేకపోవడంతో నిర్వాహకులు అవస్థలు పడుతున్న నేపథ్యంలో నూతన వంటశాల నిర్మించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.నాగభూషణరావు, హెచ్ఎం బి.జానకి తదితరులు న్నారు.

కోసిమానుగూడలో వైద్య శిబిరం

భామిని: మండలంలోని కోసిమానుగూడలో బత్తిలి వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డెంగీ నివారణ వారోత్సవాల్లో భాగంగా ఇంటింట ఫీవర్ సర్వే నిర్వహించారు. అనుమానితుల నుండి రక్తపూతలు సేకరించి వైద్య సేవలు అందించారు. దోమల నివారణకు దోమతెరల వాడకంపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఓ నర్సయ్య, వైద్య సిబ్బంది సహకరించారు.

పెదరామ వీడీవీకే కేంద్రం పరిశీలన



జీడి యూనిట్ పరిశీలిస్తున్న పీఓ

సీతంపేట: మండలంలోని పెదరామ వీడీవీకే కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలను జీడిపప్పు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్ ఎలా చేస్తున్నారు, ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం ఐటీడీఏ ఆవరణలో ఉన్న అగరబత్తీల యూనిట్‌ను చూశారు.

జోరుగా వరినాట్లు



కుక్కిడిలో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో వరినాట్లు జోరందుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కాలువల్లో నీరు చేరడంతో రైతులు పొలాలను దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా 5,350 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా.. ప్రస్తుతానికి 60 శాతం ఉబాలు పూర్తయినట్లు వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు.

గర్భిణులకు మధ్యాహ్న భోజనం

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంగళవారం విచ్చేసిన గర్భిణులకు నారాయణ సేవ పేరిట స్థానిక సత్యసాయి భజన మండలి సభ్యులు మధ్యాహ్న భోజనం అందజేశారు. ప్రతినెలా తనిఖీల కోసం వస్తున్న గర్భిణులకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇలా భోజనం అందిస్తున్నామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి అసిరినాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ఎన్నికల హామీలు నెరవేర్చాలి

రాజాం సిటీ: ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను తక్షణమే తప్పకుండా నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ వెనక ఉన్న కళావేదికలో ఆ పార్టీ రాజాం నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద చర్యలు, కార్పొరేట్ శక్తులకు దేశంలోని వ్యవస్థలను కారుచౌకగా కట్టబెట్టే విధానాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

రాజాం సిటీ: పంచాయతీలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని అంతకాపల్లి గ్రామ సచివాలయంలో వీఆర్ అగ్రహారం గ్రామ పంచాయతీకి చెందిన 2023–24 రికార్డులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డులు పూర్తి స్థాయిలో ఉండాలని తెలిపారు. ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్ చేస్తూ ఉండాలన్నారు.

పీఎంసీ ఎన్నికలకు సన్నాహాలు

- 1న నోటిఫికేషన్, 8న ఎన్నికలు
- అదేరోజు ఫలితాలు వెల్లడి, కొత్త కార్యవర్గం ఏర్పాటు
- చేతులెత్తే పద్ధతిలో కమిటీ సభ్యుల ఎన్నిక
- విద్యాశాఖ అధికారుల ఏర్పాట్లు
- జిల్లాలో ఎన్నికలు జరగనున్న పాఠశాలలు 1,558



వీరఘట్టం పాఠశాలలో చేతులు ఎత్తే పద్ధతిలో పీఎంసీ ఎన్నికల నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి ఎన్నికలను పాఠశాలల నుంచి నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ఏర్పాటు చేసిన పేరెంట్ మోనటరింగ్ కమిటీ(పీఎంసీ)ల ఎన్నికలకు ఆగస్టు 1వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్తే పద్ధతిలో పీఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. దీంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలను జరిపించేందుకు విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ ఇలా అన్ని మేనేజ్‌మెంట్‌లలో 1,558 సర్కారు బడులు ఉన్నాయి. వాటిలో 1,65,352 మంది విద్యార్థులు ఈ ఏడాది చదువుతున్నారు. ఆగస్టు 1న ప్రభుత్వం పీఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్లు లిస్టు(తల్లిదండ్రుల) జాబితా ప్రచురణ చేస్తారు. 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట లోపు ఓటర్లు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, అదే రోజు మధ్యాహ్నం 3–4 గంటల మధ్యలో తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేస్తారు. రాజకీయ జోక్యం లేకుండా ఆగస్టు 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలో లోపు పీఎంసీ ఎన్నికలను నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించి, మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య తొలి సమావేశాన్ని నిర్వహిస్తారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తాం



పీఎంసీ ఎన్నికలకు సంబంధించి ఆగస్టు 1న నోటిఫికేషన్ వెలువడనుంది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ అధికారులు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడతాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకారాన్ని అందించేలా అవగాహన కల్పిస్తాం. – జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

బడితోటలను నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో బడితోట కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ సూచించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో పాఠశాలల హెచ్ఎంలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడితోట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఖాళీ స్థలంలో కూరగాయలు, ఆకుకూరలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. వాటిని మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు వండిపెట్టాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న బడితోటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.నాగభూషణరావు, కె.కొండలరావు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్ఎల్ పాత్రుడు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం వండిపెట్టాలి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో తయారు చేస్తున్న వంటలను రుచి, శుచిగా తయారు చేయాలని ఎంపీడీఓ సూర్యనారాయణ నిర్వాహకులకు సూచించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ప్రతీ రోజు వంటకాలను తయారు చేయాలన్నారు. పరిశుభ్రత పాటించకపోతే సంబంధిత ఏజెన్సీలను తొలగించడం జరుగుతుందన్నారు.

గిరిజన గ్రామాల్లో ఆరోగ్య సర్వే..



అచ్చబలో ఇంటింటా సర్వే చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ వలంటీర్లు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని అచ్చబ, చినగీసాడ, బబ్బిడి గ్రామాల్లో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వలంటీర్లు మంగళవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ టి.రమేష్ మాట్లాడుతూ.. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో ఆరోగ్య సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిని సమీపంలోని ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్య సేవలందించడం, రక్తం అవసరమైన వారికి రక్తం అందేలా చూడటం జరుగుతుందన్నారు. నిరక్షరాస్యత, అవగాహన లేమి కారణంగా గిరిజనులు సరైన వైద్య సేవలు పొందలేకపోతున్నారని, అటువంటి వారికి చేయూత ఇచ్చేందుకు తమ సంస్థ సేవలందిస్తోందన్నారు. వైద్య సేవలు అవసరమైన గిరిజనులు 94411 58767కు సంప్రదించాలని కోరారు.

వసతిగృహ పరిసరాల పరిశీలన



వసతిగృహ పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వీరఘట్టం: స్థానిక ఆర్‌సీఎం పాఠశాలకు చెందిన బాలికల వసతిగృహం పరిసరాలను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, మేజరు పంచాయతీ ఈఓ రాము మంగళవారం పరిశీలించారు. హాస్టల్ నుండి వస్తున్న మురుగునీరు కాలువలను శుభ్రం చేయించారు. ప్రస్తుతం ఎపిడిమిక్ ఇయర్ ప్రారంభమైనందున హాస్టల్ పరిసరాలను క్లీన్‌గా ఉండేలా చర్యలు చేపట్టాలని అక్కడ సిబ్బందికి సూచించారు. మీ ప్రాంతంలో ఎక్కడైనా పారిశుద్ధ్యం క్షీణిస్తే వెంటనే పంచాయతీ కార్యాలయానికి తెలియజేయాలని కోరారు.

మలేరియా, డెంగీలపై తస్మాత్...

- జిల్లా మలేరియా నివారణాధికారి మణి



పీహెచ్‌సీ వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఎంఓ మణి

సీతంపేట: మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి వై.మణి అన్నారు. మండలంలోని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రిలో మందులు ఎలా ఉన్నాయి, ఓపీ, సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించారు. అనంతరం జయపురం గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపు చూశారు. వైద్యసేవలు అందుతున్న తీరు గూర్చి రోగులను అడిగి తెలుసుకున్నారు. లైన్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ భానుప్రతాప్, సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల చదువులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ నారాయుడు

సీతంపేట: ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పి.నారాయుడు అన్నారు. మండలంలోని శిలిగాం, రాయిమానుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలలను, జగ్గడుగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థుల చదువులను పరిశీలించారు. విద్యార్థులు ఏ విధంగా పాఠ్యపుస్తకాలు చదువుతున్నారు? పలు అంశాలు చూశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

గరుగుబిల్లి: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల వేతనాలు పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇస్తున్న మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భోజన నిర్వాహకుల సంఘం నాయకులు పావని, గౌరమ్మ, తదితరులున్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం బారామాని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గూనగంజి కోటేశ్వరరావు (46) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయన స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కోటేశ్వరరావు మృతి పట్ల సర్పంచ్ బి.గౌరీశంకరరావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

భామిని: మండలంలోని ఘనసర గ్రామంలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. సర్పంచ్ కిల్లారి కమల, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కె.ఫల్గుణరావు పర్యవేక్షణలో శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం పనులు నిర్వహించారు. వీధులు శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు.

అందుబాటులో ఎరువులు

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్‌లో రైతుల అవసరం మేరకు ఎరువులు సిద్ధం చేసినట్టు ఏఓ ఎన్ని వాహిని మంగళవారం తెలిపారు. గ్రామ స్థాయిలో రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా 412.6, డీఏపీ 13.9, పొటాష్ 15, సింగిల్ సూపర్ పాస్ఫేట్16.95, కాంప్లెక్స్ ఎరువులు 28.45 మెట్రిక్ టన్నులు అందించేలా చర్యలు చేపట్టామన్నారు.

గుణాతీతుడు గురువు

పాలకొండ రూరల్: 'గు'రువు గుణాతీతుడు అలాగనే 'రూ'పవర్జితుడు అని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు స్పష్టం చేశారు. మండలంలోని ఉంబూరు, గరుగుబిల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేపట్టారు. ఆది మధ్యాంత రహితుడైన పరమాత్మ ఈ భూమిపై భగవంతునిగా అవతరించి మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు శ్రీకృష్ణుడుగా బోధన అందించినట్లు వివరించారు. ఈ క్రమంలో కృష్ణుడి గీతా సారాంశంతో కూడిన పుస్తకాలను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఇందూ విజ్ఞాన వేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు గోపాలకృష్ణ, రామకృష్ణ, వెంకటరావు, దుర్గారావు, లక్ష్మి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చరా..!

- ప్రజలను మళ్లీ మోసగించేందుకు కూటమి ప్రభుత్వం స్కెచ్
- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం చూస్తోందని, ప్రజలను మళ్లీ మోసగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భారీ స్కెచ్ వేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ గ్రామంలో విలేకరులతో ఆమె మంగళవారం మాట్లాడారు. ప్రజలకు సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇచ్చాం, ఇప్పుడు ఆ హామీలను చూస్తే భయమేస్తోందని ఇటీవల అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసారు. అటువంటప్పుడు ప్రజలకు ఎందుకు మీరు మోసపూరితమైన హామీలు ఇచ్చారని ప్రశ్నించారు. గతంలో కూడా 2014 ఎన్నికలకు ముందు సుమారు ఆరు వందలకు పైగా హామీలు ఇస్తూ మేనిఫెస్టోలో పెట్టి గెలిచిన వెంటనే మాయం చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. మళ్లీ ఇప్పుడు అధికారం చేపట్టిన తర్వాత 2014 మాదిరిగానే హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని కళావతి అన్నారు. అమ్మకు వందనంపై దీర్ఘంగా ఆలోచనలు చేయాలని మంత్రి లోకేష్ అనడం, మహిళలకు మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇప్పటిలో ఇవ్వలేమని మరో మంత్రి నాదెండ్ల మనోహర్ అనడం, తాజాగా సూపర్–6 హామీలు చూస్తుంటే భయమేస్తోందని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనడం ఇదంతా ఓ పథకం ప్రకారం చేస్తున్నట్టుందన్నారు. అమ్మకు వందనం వస్తుందని ఎన్నో ఆశలతో మీకు ఓట్లు వేసిన తల్లులకు పంగనామం పెట్టారని, ఉచిత గ్యాస్ సిలెండర్లు వస్తాయని ఎదురుచూసిన మహిళలకు గుండెల్లో మంటలు పెట్టారని, ఉచిత బస్సు ప్రయాణం అని ఊదరగొట్టి చివరకు ఎటూ తేల్చకుండా మహిళలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందన్నారు. ఎన్నికల హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చేలా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అక్రమాలు, అరాచకాలు పేట్రేగిపోతున్నాయన్నారు. ఆడవారి మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు.

విద్యార్థులకు ఉచిత పుస్తకాలు

పాలకొండ: స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందించారు. కళాశాలలోని 540 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎం పైల శంకరరావు, అధ్యాపకులు నాగభూషణరావు, అన్నపూర్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో కచ్చితత్వం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: సామాజిక పింఛన్ల బట్వాడాలో సిబ్బంది కచ్చితత్వం చూపించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. ఆగస్టు నెల పింఛన్ల పంపిణీకి సంబంధించి తన కార్యాలయంలో 32 పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, 22 గ్రామ సచివాలయాలకు చెందిన సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ రకాల సామాజిక పింఛన్ లబ్ధిదారులు 7,461 మంది ఉన్నారన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి, ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ అందించాలన్నారు. వీరికి మొత్తం రూ.3కోట్ల 38లక్షల మేర పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో గ్రంథాలయం



గ్రంథాలయాన్ని చుట్టుముట్టిన రక్షిత పథకం వృథా నీరు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న శాఖా గ్రంథాలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో పాఠకులు గ్రంథాలయంలోకి వెళ్లే మార్గం లేక అవస్థలు పడుతున్నారు. అక్కడే ఉన్న రక్షిత తాగునీటి పథకం శుభ్రం చేసినా, నీరు విడిచిపెట్టినా, మోటార్ల ద్వారా నీటిని నింపే క్రమంలో సిబ్బంది మరచిపోయినా ఈ సమస్య తరచూ తలెత్తుతుంది. వృథా నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిల్వ ఉండిపోతుంది. ఈ సమస్య పక్కనే ఉన్న గ్రంథాలయానికే కాకుండా సమీపంలో ఉన్న గృహాలకు ఇక్కట్లు తప్పటం లేదు. దీంతో మంగళవారం గ్రంథాలయ అధికారి గణేష్‌బాబు కమిషనర్ కార్యాలయానికి వినతి అందించారు. నిత్యం నీరు నిలిచిపోవటంతో పునాదులు తడిసి, గోడలు పగుళ్లు ఏర్పడుతున్నాయని, పుస్తకాలకు చెడ పడుతుందని పేర్కొన్నారు. తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, పాఠకులకు ఇబ్బంది కల్పించకుండా చూడాలని కోరారు.

భారీగా జరిమానాలు

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించకుంటే ఇకపై భారీగా జరిమానాలు తప్పవని ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల, అంతర్గత రహదారులతో పాటు పాలకొండ– వీరఘట్టం, సీతంపేట, శ్రీకాకుళం మార్గాల్లో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వాహనాలు నడుపుతున్న మైనర్లకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్లు ధరించాలని, నడుపుతున్న వాహనాలకు సంబంధించిన పత్రాలు, వాహన చోదకులకు డ్రైవింగ్ లైసెన్సులు ఉండాలన్నారు. లేని పక్షంలో అధిక మొత్తంలో అపరాధ రుసుము విధించే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో పలువురికి అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో ఏఎస్ఐ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ: పట్టణంలోని వెంకమపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. పట్టణ అర్బన్ హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారికి ఆరోగ్య సలహాలు అందించారు. శిబిరంలో హెచ్ఎం పరంకుశంనాయుడు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించండి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన మంగళవారం జరిగింది. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు, డంపింగ్ యార్డు సమస్యను ప్రస్తావించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ డంపింగ్ యార్డు కోసం స్థలం పరిశీలించాలన్నారు. కొత్తగా పైపులైన్లు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. పట్టణ సమస్యలపై తీసుకుంటున్న చర్యలను కమిషనర్ సర్వేశ్వరరావు వివరించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



జీడిమామిడి తోటలో అంతరపంటల సాగును పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

గుమ్మలక్ష్మీపురం:

చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని ఏపీసీఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని రాయగడజమ్ము గ్రామంలో రైతులు పువ్వల రామారావు, పువ్వల దన్ను, చింతలపాడు గ్రామంలో మహిళా రైతు పత్తిక హైమావతికి చెందిన జీడిమామిడి, శ్రీరాగి వ్యవసాయ క్షేత్రాల్లో అంతర పంటలుగా సాగు చేస్తున్న చిరుధాన్యాల పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. పోడు, మెట్ట భూముల్లో చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, ఆరికలు, గంటెలు, సామలు, ఊదలు వంటివి సాగు చేసుకోవడం వల్ల పెట్టుబడులు పూర్తిగా తగ్గుతాయన్నారు. ఈ పంటలకు వాతావరణ పరిస్థితులు, పురుగులు, తెగుళ్లను తట్టుకునే శక్తి ఉండడం వలన దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. చిరుధాన్యాల పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, సిబ్బంది పి.జగదీష్, ఎం.సీతారాం, కె.చిరంజీవి, పి.రామారావు తదితరులున్నారు.